# పట్టాలు జాగ్రత్త

శ్రీమతి పోడూరి రత్నావళిగారు

౧

భాస్కరరావుగారికి ఒకత్తే కూతురు. ఆ పిల్ల చిన్నప్పటినుంచి వాళ్ళ బామ్మ వెంకాయమ్మగారి దగ్గరే పెరిగింది. నాలుగేళ్ళొచ్చాయో లేదో పెళ్ళిమాట యేం ఆలోచించావురా అంటు భాస్కరరావుగార్ని నిలేసింది వెంకాయమ్మగారు సావిట్లో ఒక రోజున. 'ఇప్పటినుంచీ ఆలోచించే దేమిటి? సరిగ్గా నాలుగేళ్ళైనా నిండలేదు. అది కాకపోయినా యిప్పుడేం పెళ్ళి. ఇదివరలాకాదు శారదాబిల్లొచ్చింది' అని చెపుతూ చిలకొయ్యమన్న కండువా తీసుకొని వీధిలోకి వెళ్ళిపోతాడు భాస్కరరావుగారు. 'ఏం నిర్లక్ష్యంరా నీకు? చెప్పేది వింటూనే ఎగడిపోతావు శార్ధాలబిల్లంటో. చేసేవాళ్ళంతా చేసుకోడంల్లా?! మనకే తగులడింది ఆ శార్ధాలబిల్లు, శార్ధాలబిల్లూనూ. చలపతిరావుగారి కొడుకు యిన్నూలుఫేను ప్యాసవుతాట్ట. కావలసిన సమంధం, కొద్దో గొప్పో మనకి వాళ్ళకి గౌరవమంటో వచ్చిందిగా అన్నీ గొరుక్కుపోయినా!! ఏం తీపా! చేసెయ్యరాదూ. పెద్ద ముండాకొడుకు యింటికొచ్చి నోరెట్టుకడిగాడు' అంటూ సతాయింపు గుక్కతిరక్కుండ మొదలెట్టింది వెంకాయమ్మగారు. భాస్కరరావు ఆలోచించాడు. ఏంలాభం కనబడలేదు. 'సరే రేపు పంచమీ బుధవారం మంచిది. వెళ్ళి తాంబూలాలు పుచ్చుకొస్తా' అని వెళ్ళిపోయాడు. పెళ్ళి నిశ్చయమయింది. పరాసుపేటనుంచి దిగారు పది రోజులకు పెళ్ళిచేసుకొని. 'పిల్లకు ప్రస్తుతం పట్టాలుపెట్టారు. తరువాత ఎప్పుడో రు. 700 నగలు చేయిస్తారట! వాళ్ళ ముఖం' అంటూ బండీలోనుంచి దిగింది వెంకాయమ్మగారు.

౨

'అమ్మాయీ ఊరికే వళ్ళు తెలియకుండా అస్తమానం తిరుగుతూవుంటావు. పట్టాలు జాగ్రత్త సుమా, ఉన్నవి అవియొక్కటే ప్రస్తుతం' అంటూ పిల్లకంటికి కనబడినప్పుడల్లా చెపుతూఉండేది వెంకాయమ్మగారు. రాత్రుళ్ళు తనదగ్గరే పడుకో పెట్టుకొని అప్పుడప్పుడు లేచి పిల్లకాళ్ళు తడుముతూ ఉండేది పట్టాలు ఉన్నాయో ఊడాయో అని. ఇట్లా ఉండగ మామగార్కి తమ అల్లుడు తమ్ముడు వడుగు అమ్మాయితో సహా రావలసిందని బండీతోసహా కబురొచ్చింది. 'అమ్మాయీ, పట్టాలు జాగ్రత్త సుమా. అక్కడను వెళ్ళి ఆ ఆడబిడ్డను యీ ఆడబిడ్డను రాసుకుంటూ తిరక్క పట్టాలు కూడా చూసుకుంటూ తిరుగు. సీల అసలే వదులుగా కూడాయుంది' అని గట్టిగ చెప్పడం మొదలెట్టింది వెంకాయమ్మగారు పిల్లకు. బండివాడు ప్రొద్దెక్కిందని తొందరపడుతున్నాడు అటతాళంమీద. పిల్లనెవరు తీసుకెళతారన్నాడు భాస్కరరావు. నే తీసుకెడతానంది పెళ్ళాం. కాని వెంకాయమ్మగారి కడుపులో అప్పుడే కదులుతున్నాయి అగ్నికణాలు. అప్పుడే ఎక్కారు పిల్లతల్లి బండి. ఎక్కడంతోటే బండి సాగింది. ఇంతట్లోకే భాస్కరరావుగారి యింట్లో చెంబులు తప్పాళాలు మొదలైన పాతర సామాను పెంకు లెగిరిపోయేటట్లు మ్రోగుతున్నాయి. 'ఏమమ్మ నీవుకూడా వెడదామని ఉందా ఏమిటి' అన్నాడు భాస్కరరావు అది కనిపెట్టి. 'నేనుకూడా ఎందుకు పంపావుకాదు ప్రతులను రెండు, దొందు— దొందు ఒళ్ళుతెలియకుండా కొళ్ళుకబుర్లు చెప్పుకుంటూ ఉండడానికి' అని విసుక్కుంటూ అంది వెంకాయమ్మ. భాస్కరరావు ఏమనుకున్నాడో బండినాపించి వెంకాయమ్మగార్నికూడా ఎక్కించాడు. 'నేనుకూడా? వెడితే నీ భోజన మెక్కడ్రా అంది వెంకాయమ్మ. 'ఏ హోటల్లోనో ఏడుస్తాలే ఆ వేళకు' అంటూ భాస్కరరావుగారు దిగడ్డాడు.